యమధర్మరాజు దగ్గర చిత్రగుప్తుని పేరుతో ఒక సహాయకుడు ఉంటాడనీ, ఆయన జీవుల ఆయుర్దాయం లెక్కలుకట్టి, ఎవరి చావు ఎప్పుడో నిర్ణయిస్తే, యమధర్మరాజు ఆ లెక్కల ప్రకారం ప్రాణాలు హరిస్తాడనీ మన పెద్దలు చెబుతారు. చిత్రగుప్తుడు యమధర్మరాజుకు ప్రతినిధిగా ప్రజలచే పూజింపబడుతూ ఉంటాడు.

ఉన్నట్టుండి భూలోకంలో ఒకరోజున -

తెల్లవారేసరికి ఒక విచిత్రమైన వార్త ప్రచారంలోకి వచ్చింది. నేటికి సరిగ్గా అయిదవ రోజున చిత్రగుప్తులవారు కొలువు చేస్తారు. ఆ కొలువులో ప్రాణులకు ఒక మహత్తరమైన అవకాశం ఉంటుంది. జీవితంలో ఇప్పటివరకూ ఎవరెవరికి ఏఏవస్తువులు ఇష్టంలేవో, వేటిని తాము మిక్కిలి అసహ్యించుకుంటారో ఆయా వస్తువులన్నింటినీ ఒక కాగితంపై వ్రాసి దర్బారులో సమర్పిస్తే, వాటికి బదులుగా ఆయా వ్యక్తులు తమతమ మనసుల్లో కోరుకునే



డా|| వాడవల్లి చక్రపాణిరావు

అందమైన వస్తువులు ఇవ్వబడతాయి. ఇలాంటి మార్పిడి జరగాలంటే, కోరుకునే వ్యక్తులకు సృష్టికర్త బ్రహ్మదేవుని సమర్థతపై సంపూర్ణ విశ్వాసం ఉండాలి. ఆయనపై నమ్మకం ఉంచి, ప్రజలు ఆయా గ్రామాలలోని దేవాలయాల దగ్గర ఒక దున్నపోతుని పూజించి, చిత్రగుప్తులవారి ప్రతిరూపాన్ని తయారుచేసి, దానికి భక్తిపూర్వకంగా నమస్కరించి, తమతమ అభీష్టవస్తువుల జాబితాను సమర్పించాలి. ఈ సమర్పణకు సుముహూర్తం సరిగ్గా నేటికి అయిదవరోజున సంభవించబోయే సూర్యగ్రహణ సమయం. గ్రహణానికి ముందుగాని, తరువాతగానీ వచ్చే అభ్యర్థనలు పరిగణించబడవు. అభ్యర్థన పత్రాలు అన్నిటినీ సర్వాంతర్యామి అయిన బ్రహ్మదేవుడే స్వయంగా పరిశీలించి, ఆయావ్యక్తుల అర్హతలను బట్టి వారివారి కోరికలను మన్నిస్తాడు. ఈ మార్పిడి అవకాశం భూలోకవాసులకే కాదు – సమస్త లోకాలవారికీ వర్తిస్తుంది. నమ్మకం గలవారు తమతమ అదృష్టాలను పరీక్షించుకోవచ్చు.

ఈ సమాచారం ఎక్కడనుంచి వచ్చిందో తెలియదు. ఎవరిద్వారా వచ్చిందో తెలియదు. దానిలోని నిజానిజాలు ఏమిటో కూడా ఎవరికీ తెలియవు. వినాయకుడు పాలు త్రాగుతున్నాడు అనేవార్త ఒకప్పుడు ప్రపంచమంతా క్షణాల మీద ఎలా వ్యాపించిందో, అంతకంటే వేగంగా ఈ సమాచారం సూర్యుడితో పాటుగా ఆ రోజున లోకాలను మేల్కొలిపింది.

భూలోకంలోని ప్రజలందరూ వింతగా చెప్పుకుంటూ, ఆ సంగతేమిటో తెలుసుకోవాలి అనుకున్నారు.

బ్రహ్మ సృష్టికర్త. సృష్టి ఉంది కనుక దీనికి కర్త ఒకడు ఉంటాడు అనుకోవడంలో తప్పేమీ లేదు. ఆయనపేరు బ్రహ్మ అనుకోవడానికీ అభ్యంతరంలేదు. ఇంతటి వైవిధ్యంతో సృష్టిని నిర్వహిస్తున్న ఆ బ్రహ్మ సర్వసమర్థుడు అనుకోవడానికీ అభ్యంతరం లేదు.

ఇక యమధర్మరాజు, ఆయన దగ్గరుండే చిత్రగుప్తుడూ – వీరిని గురించి మనపురాణాల్లో వింటాం. నాటకాలు, సినిమాల్లో వీరిచుట్టూ ఎన్నెన్నో కథలు కల్పించి చూపిస్తుంటారు. జీవి పుట్టటం ఎంతసహజమో, గిట్టటం కూడా అంతే సహజం. పుట్టుకకు కర్త బ్రహ్మ అయినట్లే, చావుకి కర్త యమధర్మరాజు అనుకోవడంలో దోషమేమీలేదు. చావులు ఎవరికిబడితే వారికి, ఎప్పుడు బడితే అప్పుడు రాకుండా ఒకపద్ధతి ప్రకారం వస్తున్నాయనేది యధార్థం. ఎవరికి ఎప్పుడు ఆయువు తీరితే వారు అప్పుడు పోతున్నారు తప్ప, తమతమ ఇష్టానుసారం ఎవరూ పోవటంలేదు. కాబట్టి ఈ విషయంలో ఏదో

బ్రహ్మవరం

ఒక పరిగణన ఉన్నట్టే కనిపిస్తుంది. కనబడని ఆ పరిగణన విభాగాన్నే మనపూర్వులు చిత్రగుప్తునిగా చెప్పి ఉంటారు. కాబట్టి ఆయన పేరుతో ఒక దర్బారు ఏర్పాటు చేసుకుని, మనసులలోని అసంతృప్తులను బ్రహ్మ సాక్షిగా వెల్లడించుకోవటంలో తప్పేమీ లేదు. ఇందులో ఎవరూ నష్టపోయేది ఏమీ ఉండదు. కాబట్టి ఈ మార్పిడి అవకాశం సంగతేంటో చూద్దాం అని ప్రజలు ఎవరికివారు నిశ్చయానికి వచ్చారు.

ప్రజల మనోభావాలు వింతవింతలుగా సాగాయి.

ఒక భర్త – 'మా ఆవిడ చాలా అసహ్యంగా ఉంది. ఈమెను మార్చి అందమైన భార్యను దేవుడు నాకిస్తే బాగుండును' అనుకున్నాడు.

ఒక భార్య – 'నా మొగుడు నరరూపరాక్షసుడు. వీడికి బదులు అందమైన మంచి భర్త రావాలి' అనుకుంది.

ఒక పడుచుపిల్ల – 'నా రూపం నాకే అసహ్యంగా ఉంది. ఈ రూపం పోయి అందమైన రూపం వస్తే బాగుండును' అని కోరుకుంది.

ఒక ముసలమ్మ వంగిపోయి, ముడతలు పడి, శక్తిహీనమైన శరీరాన్ని చూసుకుంటూ – 'జీవితంలో నేను ఏమీ అనుభవించలేకపోయాను. నా వయసూ, రూపమూ, శక్తీ నా ప్రమేయం లేకుండానే తరిగిపోయాయి. అసహ్యకరమైన ఈ రూపం పోయి, అందమైన పడుచుదనంతో కూడిన రూపం మరొక్కసారి వస్తే ఎంత బాగుంటుంది' అనుకుంది.

జగన్నాథ సాహితీ సమాఖ్య (నల్లజర్ల) చతుర్థ వార్షికోత్సవ సందర్భంగా జరిగిన సభలో కవితా జగన్నాథ్ కవితా సంకలనాన్నీ, 'మన రచయితలు – రచయిత్రులూ' రెండవ భాగాన్నీ ఆవిష్కరిస్తున్న దృశ్యం. ఫొటోలో వరుసగా (ఎడమనుంచి కుడికి) శ్రీయుతులు కె.ఎస్.ఎస్.వి.ఎస్.ఆర్. సోమనాథ్, వి.ఎస్.వి. ప్రసాద్, గుడిమెట్ల చెన్నయ్య, తెన్నేటి లక్ష్మీనరసింహమూర్తి, అగస్త్యరాజు సర్వేశ్వరరావు, కె.ఎస్.ఆర్.కె.వి.వి. ప్రసాద్, కొత్తపల్లి ఉదయబాబు.



రోగాలతో బాధపడుతూ మంచానికి అంటుకుపోయి నేడో, రేపో అన్నట్టుగా ఉన్న ఒక వ్యక్తి తన మనస్సులో – 'ఓ బ్రహ్మదేవుడా! నాకు ఈ బ్రతుకుపట్ల రోత పుట్టింది. నేను లేచి చిత్రగుప్తుని కొలువుకు రాలేను. గ్రహణం మొదలవగానే ఇక్కడినుంచే నీకు నమస్కరించుకుంటాను. ఈ శరీరాన్ని మార్చేసి నాకు ఆరోగ్యవంతమైన, అందమైన శరీరాన్ని ప్రసాదించు' అనుకున్నాడు.

ఇలా ఎందరెందరో ప్రజలు ఏవేవో కోరికలతో సిద్ధమయ్యారు.

ప్రతి గ్రామంలోనూ చిత్రగుప్తుని కొలువు ఏర్పాటయింది.

గ్రహణంరోజు రానేవచ్చింది. ప్రజలందరూ స్నానాలు చేసి, మడిబట్టలు కట్టుకుని, మొహాన బొట్టు పెట్టుకుని, పూజాద్రవ్యాలతో కొలువు కూటములకు వచ్చారు. యధాశక్తీ పూజలు చేసారు. గ్రహణం పట్టు మొదలయ్యేసరికి భక్తిగా కళ్లు మూసుకుని బ్రహ్మను ధ్యానించటం మొదలుపెట్టారు.

బ్రహ్మదేవుడు ఒక మొహంతో స్వర్గాన్నీ, ఇంకో మొహంతో భూలోకాన్నీ, మరొక మొహంతో పాతాళాన్నీ పరికించి చూశాడు. త్రిలోకాలలోనూ ఒక్కరు కూడా మినహాయింపు లేకుండా కొలువుకు వచ్చి కోరికలు చెప్పుకుంటున్నారు. బ్రహ్మకు ఆశ్చర్యంతో బుర్రలు తిరిగిపోయాయి. 'నా సృష్టిని గురించి ఇంతమందిలోనూ ఇంతటి అసంతృప్తా?' బ్రహ్మ చాలా బాధపడ్డాడు. 'నా సృష్టిలో ఏ ఒక్కడూ సుఖంగా, తృప్తిగా లేడా? మరోసారి చూద్దాం' అనిపించి, ఈసారి నాలుగవ ముఖంతో లోకాలన్నీ గాలించి చూసాడు. స్వర్గంలోనూ, పాతాళంలోనూ తనకు కావలసిన వ్యక్తి తగలలేదు.

కానీ, భూలోకంలో భారతదేశంలోని ఒక మారుమూలపల్లెలో ఒకే ఒక వ్యక్తి తన గోశాలలో గోవులను సేవిస్తూ కనిపించాడు.

బ్రహ్మకు ప్రాణం లేచివచ్చింది. హంసవాహనాన్ని అధిరోహించి, ఆఘమేఘాలమీద ప్రయాణించి, రెప్పపాటు సమయానికి ఆ వ్యక్తి ముందు ప్రత్యక్షమయ్యాడు.

"ఏమి నాయనా! నీవొక్కడివీ ఇక్కడ ఇలా గోవులతో ఉండిపోయావేం? నీవెరుగవా? ఇది పవిత్రమైన గ్రహణసమయం. ముల్లోకాల్లోని ప్రజలు తమతమ మనస్సులలోని అసంతృప్తులను బ్రహ్మకు నివేదించి, మార్పు కోరుకుంటున్నారు. మీ ఊరి జనమంతా కూడా చిత్రగుప్తుని కొలువుకు తరలి వెళ్లారు గదా! మరి నువ్వెందుకు వెళ్ళలేదు?" అని అడిగాడు.

ఆ వ్యక్తి తలెత్తి బ్రహ్మకేసి చూసి నమస్కరించాడు.

"దేవాధిదేవా! నాకు ఈ సృష్టి అంతా సర్వాంగసుందరంగాను, సర్వసమగ్రమైనదిగానూ కనిపిస్తూ ఉంటుంది. పరమదయామయుడవైన నీ సృష్టిలో లోపాలు ఎందుకు ఉంటాయి? అందుకే నాకు తెలిసినా నేను అందరితోపాటు ఆ కొలువుకేసి వెళ్ళలేదు." అన్నాడు.

బ్రహ్మ ఆశ్చర్యపోయి, "ఈ విశాలమైన విశ్వంలో నీకు అసంతృప్తి కలిగించే అంశం ఒక్కటి కూడా లేదా?" అని అడిగాడు.

"లేదు బ్రహ్మదేవా. అసంతృప్తి అనేది మనసుకి సంబంధించింది గదా! సృష్టికి సంబంధించింది ఎలా అవుతుంది? నువ్వు ఇంతమంది కోర్కెలు నెరవేర్చటం కోసం వారువారు కోరిన ప్రకారం ఈ సృష్టిని మార్పు చేసావనుకో. అప్పుడు మాత్రం వీరి మనస్సులలో కొత్త అసంతృప్తులు రావా? అయినా నాకు ఈ విశ్వసృష్టిలో ఏ లోపమూ కనిపించదు. ఈసృష్టిలోని ఏ చిన్న వస్తువును తీసుకున్నా నాకు అందులో సౌందర్యమూ, సమగ్రతా కనిపిస్తాయి. ఈ వస్తువులన్నీ నీ ప్రతిరూపాలే అనిపిస్తాయి. ఆఖరికి ఈ గడ్డిపరక ఉందనుకో. ఇందులో కూడా నాకు నువ్వే కనిపిస్తావు. ఈ గడ్డిపరకలను తిని ఈ ఆవు కడుపు నింపుకుంటున్నప్పుడు నీవు ఎంతటి దయామయుడవో కదా. అంతటి మహానుభావుడివై ఉండీ ఈ చిన్న గడ్డిపరకల రూపంలో పశువులను సేవిస్తున్నావే అని నీ వైభవమే గుర్తుకువచ్చి ఆనందంతో పరవశిస్తాను..."

బ్రహ్మదేవుడికి ఆ మాటలకు ఇంకా ఆశ్చర్యం కలిగింది. 'అణువణువునా బ్రహ్మమును దర్శిస్తూ ఆనందించే వ్యక్తికి ఈ సృష్టిలో ఎవరు సాటి?' అనుకున్నాడు.

"...మరయితే రోగాలు, రొష్టులు, ముసలితనం, మరణం... ఇవేవీ నీకు లోపాలుగా కనిపించటంలేదా?" అని అడిగాడు.

ఆ వ్యక్తి గట్టిగా నవ్వి, "ఓ చతుర్ముఖా! నన్ను మీరు పరీక్షిస్తున్నట్టుగా ఉంది. నేనేమంత చదువుకున్నవాడిని కాదు. పామరుణ్ణి. కానీ ఒక్కటి చెప్పగలను. పుట్టుక, ఎదుగుదల, ముసలితనం, మరణం అనేవి నీ సృష్టిలో భాగమైన సహజ పరిణామ దశలు. నేను ఒక మొక్కను పాతాను అనుకో. అది పెరిగి వృద్ధిఅయి, ఫలాలనిస్తుంది. ఆ ఫలాలలోని గింజల ద్వారా అలాంటివే కొత్త మొక్కలు ఎన్నో వస్తాయి. ఈ చెట్టు ముసలిదవుతుంది. ఎండిపోతుంది. అయితేనేం, ఆ వృక్షసంతతి వృద్ధి అవుతూనే ఉందిగదా! ఆ చెట్టు అలా ఎండిపోకపోతే దానికి దగ్గరలో కొత్త మొక్కలు రావు గదా! సృష్టిలోని వివిధ జీవులు ఈ విధమయిన వికాసాన్ని పొందటమే బ్రహ్మము అనేపదానికి అర్థమని నాకనిపిస్తుంది. ఇంక నువ్వు చెప్పిన రోగాలు, రొష్టులు, జరాభారం అన్నవి సృష్టిలో ఒక్క మానవునికి మాత్రమే



సమస్యలుగా మరాయి అనిపిస్తుంది. తక్కిన జీవరాశులు తమతమ దేహాలను సక్రమంగా వినియోగించుకుంటూ, ప్రకృతి సహజమైన జీవనవిధానాలను గడుపుతున్నాయి. కనుక వాటికి ఇలాంటి సమస్యలు లేవు. మానవుడు మాత్రమే తెలివితేటలతో ప్రకృతి విరుద్ధంగా జీవించి, రోగాలు, ముసలితనం మొదలయిన వాటితో బాధపడుతున్నాడు. మా తాత నూట పాతిక సంవత్సరాలు ఆరోగ్యంగా జీవించి, తిరుగుతూ, తిరుగుతూ కన్నుమూసాడు. మా తండ్రి నూటపది సంవత్సరాలు జీవించి, అనాయాసంగా వెళ్ళిపోయాడు. నాకిప్పుడు వందేళ్ళు. ఎలాంటి అనారోగ్యమూ లేదు. ముసలివాడిననే భావమే నాకు కలగదు. మరొక పాతికేళ్ళు తప్పక జీవిస్తానని నా నమ్మకం. మరి అలాంటప్పుడు మానవునికి స్వయంకృతంగా సంక్రమించే వ్యాధులకు సృష్టికర్తను నిందించటం సబబుకాదు గదా! మాకు నువ్వేమి లోటు చేసావని? ఈ గాలి, ఈ నీరు, ఈ భూమి, ఈ ఆకాశం, సూర్యుడు, చంద్రుడు... ఇవన్నీ నీవిచ్చిన అనంతసంపదలే గదా! ఒక్కగింజ వేస్తే వందల గింజలు పండేలా అనుగ్రహిస్తున్నావే. ఇంత కంటే ఏంకావాలి?" అంటూ నమస్కరించాడు.

బ్రహ్మదేవుడు చాలా సంతోషించి, "ఓ మహానుభావా! బ్రహ్మనై ఉండీ బ్రహ్మానందం అంటే ఏమిటో మర్చిపోయిన నాకు అదేమిటో ప్రత్యక్షంగా చూపించావు. నీవిచ్చిన ఈ ఆనందంతో నేను నా సృష్టికార్యాన్ని మరికొన్ని మహాయుగాలు కొనసాగిస్తాను. నీకేమైనా వరం ఇద్దామనుకుంటున్నాను కోరుకో" అన్నాడు.

ఆ వ్యక్తి నవ్వుతూ బ్రహ్మకు నమస్కరించి, ఇలా అన్నాడు. "నన్నునుగ్రహించి, నీ నిజరూపంతో నాకు సాక్షాత్కరించావు. ఇంతకన్నా నాకేం కావాలి. నన్నెప్పుడూ ఇలాగే ఇదే స్థితిలో ఉండేలా ఆశీర్వదించు చాలు" అన్నాడు.

ఆకాశం నుంచి మధురమైన సంగీతం వినబడింది. పూలవాన కురిసింది.

బ్రహ్మదేవుడు తృప్తిగా తన లోకానికి చేరుకున్నాడు. ●